www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 24 డిసెంబర్ 2024
5
వైఎస్ఆర్

నేడు పులివెందులకు జగన్ రాక

ప్రజాశక్తి పులివెందుల టౌన్ : మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నారు. 24న బెంగళూరు నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఇడుపులపాయ ఎస్టేట్ చేరుకుని వైఎస్ఆర్ ఘాట వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పిస్తారు. అనంతరం కుటుంబసభ్యుల తోనూ, వైసిపి నాయకులతో చర్చించి అక్కడే బస చేస్తారు. 25న ఉదయం 8 గంటలకు ఇడుపులపాయ నుంచి బయలుదేరి పులివెందుల సిఎస్ఐ చర్చిలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. లింగాల మండలం తాతి రెడ్డిపల్లి సీతా రామదేవస్థానంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 26 తేదీన పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. 27న ఉదయం 9 గంటలకు విజయ గార్డెన్‌లో నిర్వహించే వివాహ వేడుకల్లో పాల్గొని విజయ వాడకు బయలుదేరుతారు.

కుర్చీ కోసం మళ్లీ రగడ

వాదోపవాదనలకు దిగిన మేయర్, ఎమ్మెల్యే

- రసాభాసగా కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం
- మేయర్ పోడియం వద్ద ఎమ్మెల్యే నిరసన
- మద్దతు తెలిపిన టిడిపి కార్పొరేటర్లు
- మేయర్‌కు మద్దతుగా వైసిపి కార్పొరేటర్లు
- పోటా పోటీగా నినాదాలు.. తోపులాట
- టిడిపి ఎమ్మెల్యే కార్పొరేటర్లను సస్పెండ్ చేసినట్లు మేయర్ ప్రకటన
- చేతులెత్తి బిల్లులకు ఆమోదం

ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న మహిళా కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం కుర్చీ కోసం మరో మారు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గత సమావేశంలో కూడా కుర్చీ కోసం ఇలాంటి సంఘటనే ఉత్పన్నమవడంతో ఆ సమావేశం వాయిదా పడింది. సోమవారం అభివృద్ధి పనులకు నిధులు, కాంట్రాక్టు, కోవిడ్, అదనపు పారిశుధ్య కార్మికుల వేతనాల నిధులు ఆమోదం కోసం మరో మారు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ ఛాంబర్ పక్కన సీటు వేయాలని ఎమ్మెల్యే మాధవి, టిడిపి కార్పొరేటర్లు పట్టుబట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యేకు మద్దతుగా, మేయర్ మద్దతుగా ఇరువురు కార్పొరేటర్లు పోటీపడి నినాదాలు చేశారు. అజెండాను కొనసాగించేందుకు సహకరించాలని మేయర్ సురేష్ బాబు పదేపదే విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే, సభ్యులు వినిపించుకోలేదు. దీంతో టిడిపి కార్పొరేటర్లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఎవరు వినిపించుకోవడంతో యథాస్థితి కొనసాగింది. కార్పొరేటర్ల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దాదాపు గంటన్నర పాటు పోటాపోటీ నినాదాలతో గందరగోళ పరిస్థితి నెలకొంది. సభ ముందుకు సాగలేదు. అజెండాను చదివేందుకు ప్రయత్నించిన వెంటనే అజెండా కాపీలను చించివేశారు. పరిస్థితి చేయి దాటి పోతుందని గ్రహించిన మేయర్ సభను అరగంట పాటు వాయిదా వేశారు. సభ కొనసాగకపోతే 15వ ఆర్థిక నిధులు ఆగిపోతాయని మేయర్, కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు మేయర్ కుడి ఎడమ వైపు వేదికపై కుర్చీలు వేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం మారి టిడిపి అధికారంలోకి రాగానే మొదటి సమావేశానికి మేయర్ సురేష్ బాబు హాజరు కాలేదన్నారు. అప్పుడు కుర్చీ యథావిధిగా ఉంచి తనను గౌరవించారని గుర్తు చేశారు. మేయర్ సురేష్ బాబు సమావేశానికి హాజరైన సమయంలో టిడిపి ఎమ్మెల్యే మేయర్ పక్కన సీటు లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన మేయర్ కుర్చీని కార్పొరేటర్లు ఎక్కడ లాగేస్తారో అన్న భయంతో ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మహిళ అని వివక్ష చూపడం అన్యాయమన్నారు. మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ నిలదీశారు. మహిళలను మేయర్ అవమానిస్తున్నారని మన కుర్చీని పేర్కొన్నారు.

అవమానించడానికే కుర్చీ వేయలేదు : ఎమ్మెల్యే

ఎక్కడ మేయర్, ఆయన కుటుంబ సభ్యులు చేసిన అవినీతి బయటపడుతుందోనని కార్పొరేషన్ సాధారణ సర్వసభ్య సమావేశం నుంచి పారిపోయారని ఎమ్మెల్యే ఆర్ మాధవి అన్నారు. సోమవారం ద్వారకా నగర్‌లోని ఆమె స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అజెండాలోని అంశాలు సమావేశంలో చర్చ కుండా ఆమోదించడమని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేసి ఇలాంటి సమావేశాలను ఏర్పాటు చేయడం కంటే మేయర్ తన ఇంట్లోనే కార్పొరేటర్లతో ఆమోదించుకోవచ్చని సూచించారు. మహిళా ఎమ్మెల్యేని అవమానించేందుకే మేయర్ సీటు పక్కన తనకు సీటు వేయలేదని ఆరోపించారు. ఎనిమిది సంవత్సరాలుగా అవినీతి సామ్రాజ్యాన్ని మేయర్ కొనసాగిస్తున్నారని తెలిపారు. వీరి పార్టీ పెద్దలు బుద్ధి చెప్పకుండా అచ్చోసిన ఆంబోతులా మాట్లాడిస్తున్నారని విమర్శించారు. మహిళా కార్పొరేటర్లను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయాలని చూస్తూ ఉన్నారని పేర్కొన్నారు. టిడిపిలోకి ఎనిమిది మంది కార్పొరేటర్లు వచ్చారని మేయర్ భయ పడుతున్నారని, మరి కొంతమంది వస్తున్నారన్న విషయం గ్రహించాలని హితవు పలికారు. మేయర్ పదవికి సురేష్ బాబు అనర్హుడని తెలిపారు. ఆలం ఖాన్‌పల్లె కార్పొరేటర్ ఏ పార్టీకి చెందినవారు మేయర్ తెలుసుకోవాలని పేర్కొన్నారు.

కుర్చీ వేసే ప్రసక్తే లేదు : మేయర్

నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలను పట్టించుకోని టిడిపి ఎమ్మెల్యే ఆర్ మాధవి కుర్చీ కోసం మాత్రం తెగ ఆరాటపడుతున్నారని మేయర్ సురేష్ బాబు విమర్శించారు. మేయర్ ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆలంఖాన్‌పల్లె కార్పొరేటర్‌ను, మహిళా కార్పొరేటర్ల భర్తలను అవమానించిన ఎమ్మెల్యే కుర్చీ వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో తనకు ఎటువంటి అధికారం ఉండదని తెలిపారు. తన రాజకీయ జీవితంలో అన్ని పార్టీలతో, నాయకులతో విలువలతో కూడిన రాజకీయాలు చేశానని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజలను, నాయకులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశ చరిత్రలో మేయర్ ఇంటిలో చెత్త వేసిన సంఘటనలు ఎక్కడా లేవన్నారు. టిడిపి ప్రభుత్వం నుంచి నగర అభివృద్ధికి ఎమ్మెల్యే ఒక పైసా కూడా తీసుకురాలేదని స్పష్టం చేశారు. రూ.15 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం పనులను ఆమోదించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే అజెండాలోని అంశాలను ఆమోదించామని పేర్కొన్నారు. టిడిపి నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డి పై టిడిపి వాళ్లతోనే దాడి చేయించింది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. 40 సంవత్సరాలుగా టిడిపి జెండా మోసిన వారు అక్కడ లేరన్నారు.

ప్రయివేట్, కార్పొరేట్

మార్కెట్ యార్డులను రద్దు చేయాలి

- అంబేద్కర్ సర్కిల్లో రైతు సంఘాల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటెడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రయివేట్, కార్పొరేట్ మార్కెట్ యార్డ్‌లో ద్వారా రైతుల వ్యవసాయ ఉత్పత్తులను చౌకగా కార్పొరేట్ కంపెనీల పరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వామపక్ష రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు దస్తగిరి రెడ్డి, ఎం.వి. సుబ్బారెడ్డి విమర్శించారు. సోమవారం కేంద్ర కమిటీ పిలుపుమేరకు అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగం చారిత్రత్మక పోరాటంతో తిప్పికొట్టిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా ప్రయత్నం చేస్తుందని తెలిపారు. మద్దతు ధరల చట్టం అమలు కోసం పోరాడుతున్న రైతులపై బిజెపి ప్రభుత్వాల నిర్బంధాన్ని ఖండిస్తూ, వ్యవసాయ మార్కెట్లను నిర్వీర్యం చేసే నేషనల్ ఫ్రెమ్ ప్రయివేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. చారిత్రాత్మక రైతు ఉద్యమంతో మూడు వ్యవసాయ నల్ల చట్టాల అమలుపై వెనక్కి తగ్గి, బహిరంగంగా క్షమాపణలు చెప్పిన మోడీసర్కార్, ఇప్పుడు మళ్ళీ అవే చట్టాల్ని పేరు మార్చి అమల్లోకి తెచ్చే ప్రయత్నం చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా మార్కెట్ వ్యవస్థలన్నింటినీ ఒకే గొడుగుకు కిందకు తీసుకొస్తామని ముసాయిదాలో తెలిపారు అన్నారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితులు, పంటల సరళి, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తేవడం నల్ల చట్టాల అమల్లో భాగమే అని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శి రామ్మోహన్, వెంకట శివ, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, నాయకులు కుమారస్వామి రెడ్డి, రామకృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టక్కోలి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న రైతుల సంఘాల నాయకులు

ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి - కడప

కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్ డి. విజయ జ్యోతి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బాబా సాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభానికి ముందు, మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్న తరువాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహానికి నివాళులు అర్పించి, భారత రాష్ట్రపతి గారికి సంయుక్త కలెక్టర్ ద్వారా ఒక మెమోరాండం అందజేశారు. తరువాత కలెక్టరేట్ ప్రాంగణంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమాన్ని పక్కన పెట్టి మనుస్మృతిని భారత రాజ్యాంగం స్థానంలో తీసుకురావాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. భారత దేశం ప్రజాస్వామ్య దేశం,అన్ని వర్గాల సంక్షేమం కాపాడాల్సిన బాధ్యత కేంద్రంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ప్రభుత్వం పైన ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, ప్రొద్దుటూరు అసెంబ్లీ కోఆర్డినేటర్ ఇర్ఫాన్, పులివెందుల అసెంబ్లీ కోఆర్డినేటర్ ధ్రువ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ సుశీల్ కుమార్, పీర్, గోసంగి సుబ్బా రెడ్డి, హరి ప్రసాద్, గున్నంపాటి వెంకట రమణ, సిరాజుద్దీన్, మొయినుద్దీన్, శ్యామలమ్మ, సంజయ్ కాంతా, సంతోషమ్మ, నాగ రత్న గౌడ్, హమీద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి కడప అర్బన్

నిరుద్యోగులకు జాబ్ గ్యారెంటీ అనే పేరుతో లక్షల, కోట్ల రూపాయలు అక్రమ సంపాదనకు పాల్పడిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరం మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్న సత్యానంద రెడ్డి, మహేష్ రాయలసీమ జోన్‌లో ఉన్న నిరుద్యోగులకు జాబ్ గ్యారెంటీ అంటూ యూట్యూబ్‌లో తరగతులు చెబుతూ లక్షల, కోట్ల రూపాయల దోపిడీకి చేస్తున్నారని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తమ వద్ద ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటే ఉద్యోగం గ్యారెంటీ అని నమ్మ పలుకుతున్నారని తెలిపారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కడప నగర ఉపాధ్యక్షులు వంశీ పాల్గొన్నారు.

అపర్ణకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - కడప : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ జువాలజీ విభాగంలోని పరిశోధకరా ఇనుకోలు అపర్ణకు ఎస్వి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని పరీక్షల నియంత్రణ విభాగం అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ విభాగంలోని విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఎం. శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో 'ఎఫికెసిఆఫ్ బయోఫ్లాక్స్ ఇన్ ద కల్చర్ ఆపరేషన్ ఆఫ్ పసిఫిక్ వైట్ ష్రిమ్ప్ లితోపేనియస్ వనామీ" అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు.

హరిశ్చంద్రుని పాత్రకు ప్రాణం పోసిన 'శ్రీహరి'

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : దళిత కుటుంబంలో పుట్టిన శ్రీహరి రావు బాల్యం నుంచి నేటి వరకు బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్య హరిశ్చంద్ర నాటకంలో ఒక్క హరిచంద్రుని పాత్రను వందలసార్లు నటించి ఆ పాత్రకు ప్రాణం పోసి రెండు తెలుగు రాష్ట్రాల్లో మన జిల్లా కీర్తిని ఇనుమడింప చేసిన ఉత్తమ గాయకుడు అని ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో బలిజేపల్లి వారి 143వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిశ్చంద్రుడి పాత్రను అద్భుతంగా నటించి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన శ్రీహరిరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ బద్వేలు తాలూకా గోపవరం మండలం బుచ్చనపల్లెలో జన్మించిన శ్రీహరి రావు బాల్యం నుంచి నాటక రంగంపై మక్కువ చూపారని తెలిపారు. పదవ తరగతి లోనే మయసభను అద్భుతంగా ప్రదర్శించారని పేర్కొన్నారు. కేతవరం మునెయ్య దగ్గర సంగీత మెలకువలు నేర్చుకున్నారన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ ఆయన డి.వి. సుబ్బారావు, రత్న కుమార్,వై.గోపాల్ రావు, వెంకటేశ్వరరావు, విజయరాజు మొదలైన ప్రసిద్ధ రంగస్థల కళాకారులకు ఏమాత్రం తీసిపోని విధంగా రాగాలను పలికించగల దిట్ట అన్నారు. ఎన్నో సంస్థల నుంచి సత్కారాలు, సన్మానాలు స్వీకరించారని తెలిపారు. తెలుగు విశ్రాంత అధ్యాపకులు జీవకళ సత్యనారాయణ ప్రసంగిస్తూ రాముడు, కృష్ణుడు, అర్జునుడు,భవాని శంకర్, కక్కయ్య పాత్రలను కూడా అలవోకగా నటించగల సమర్థుడని అన్నారు. కార్యక్రమంలోప్రసిద్ధ రంగస్థల కళాకారులు మందల మురళి, ప్రకాశం, కిరణ్, సత్యనారాయణ, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డిని విధుల నుంచి తొలగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్‌గా ఉంటూ జమ్మలమడుగు ప్రిన్సిపల్‌గా కొనసాగుతున్న రామకృష్ణా రెడ్డి ని విధుల నుండి తొలగించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జమ్మలమడుగులోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా, జిల్లా కన్వీనర్‌గా గత కొన్ని సంవత్సరాలుగా రెండింటికీ రామకృష్ణా రెడ్డి విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కొద్ది రోజుల కిందట జమ్మలమడుగులోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో దొమ్మర నంద్యాల గ్రామానికి చెందిన విద్యార్థి హాస్టల్ నుంచి పారిపోయాడని పేర్కొన్నారు. తల్లిదండ్రులు సమాచారం ఇవ్వడంలో అలసత్వం వహించారని తల్లిదండ్రులే చెబుతున్నారన్నారు. ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. తక్షణవే ఆయన్ను విధులు నుంచి తొలగించి మరొకసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ.నరసింహులు పాల్గొన్నారు.

దంత వైద్య కళాశాలలో వర్క్‌షాప్

ప్రజాశక్తి - కడప

కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ఎన్టీఆర్ యూనివర్సిటీ సిడిఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం పీజీ విద్యార్థులు, ఆర్థో డాంటిక్ స్పెషాలిటీ డాక్టర్లకు వర్క్ షాప్ నిర్వహించారు. ఎత్తు వంకర పళ్ళు సరిచేసి ముఖాన్ని అందంగా తీర్చిదిద్దే విభాగంలో ఉన్న డాక్టర్లకి మెలుకువలు నేర్పించేందుకు వర్క్ షాప్ నిర్వహించేందుకు అదితి స్పీకర్‌గా చెన్నై నుంచి ఆర్థో డెంటిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ జనార్ధన్ వర్క్ హాజరయ్యారు. విద్యార్థులకు మెలకువలు తెలియజేశారు. 78 మంది పీజీ విద్యార్థులు, 20 మంది డాక్టర్లు, ఆర్థో డాంటిక్ విభాగంలో ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ యుగంధర్, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ జాషువా, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ గౌరీ శంకర్, డాక్టర్ మాండవ ప్రసాద్ పాల్గొన్నారు.

బిటెక్ విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వల్లూరు

చెక్‌ను అందజేస్తున్న దాత

వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థిని హేమలతకు తేజస్విని ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రూ. 13 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. లింగాయపల్లి గ్రామానికి చెందిన హేమలతకు తేజస్విని ఛారిటబుల్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి వారి స్నేహితులు, చంద్ర ట్రస్టు సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థినికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సి. వి సురేంద్ర, జీ.వి సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాలో సుపరిపాలన కొనసాగాలి : జెసి

ప్రజాశక్తి - కడప: సమర్థవంతమైన పాలన, సేవలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా చేపట్టిన గుడ్ గవర్నెన్స్ వీక్ క్యాంపెయిన్ కార్యక్రమాలు జిల్లాలో నిర్విరామంగా కొనసాగిస్తూ ప్రజలకు నమ్మకమైన సూపరిపాలనను అందించాలని జెసి అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఎఆర్‌పిజి) ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ఈ నెల19 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న 'గుడ్ గవర్నెన్స్ వీక్' క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం కలెక్టరేట్ లోని సభాభవన్‌లో జడ్‌పి సిఇఓ ఓబులమ్మ అధ్యక్షతన వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెసి అదితిసింగ్ మాట్లాడుతూ గుడ్ గవర్నెన్స్ అంటే ప్రభుత్వం తన ప్రజలకు సమర్థవంతంగా, పారదర్శకంగా, జవాబుదారీతో సేవలు అందించే విధానం అన్నారు.

రైతే దేశానికి వెన్నెముక

ప్రజాశక్తి-కాశినాయన

విద్యార్థులతో కలిసి వరి నాటుతున్న కరస్పాండెంట్

రైతు దేశానికి వెన్నెముక లాంటి వాడని పోరుమామిళ్ల వైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఆర్.వి రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆ పాఠశాల ఆధ్వర్యంలో రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల రైతుల వేషధారణలు ధరించి లఘు నాటిక ద్వారా దృశ్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే రైతుల కష్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రాముఖ్యత గురించి క్లుప్తంగా తెలియపరిచామన్నారు. ప్రిన్సిపల్ కళ్యాణి మాట్లాడుతూ జై జవాన్ జై కిసాన్ అనే నినాదంతో రైతు ముందుకు వెళుతున్న రోజుల్లోనే వాతావరణ కాలుష్యం చాలా చక్కగా ఉండేదని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి కేశవరాయుడు, వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కెఎల్ఎం' కళాశాలలో..

కడప అర్బన్ : కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాజరైన వక్తలు మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక అన్నారు. అన్నదాతను ఆదుకోవడం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రకృతి విలయ తాండవం చేసినపుడు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతు లేనిదే మనుగడ శూన్యమన్నారు. విద్యార్థుల నృత్య రూపకం ఆకట్టుకుంది. రైతు కృషిని కొనియాడుతూ గీతాలు పాడుతూ ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ అన్ని శాఖల విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలి

- డిఆర్ఓ విశ్వేశ్వరనాయుడు

ప్రజాశక్తి - కడప

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకొని అమ్మకాలలో జరుగుతున్న మోసాలను అరికట్టాలని డిఆర్ఓ విశ్వేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం, జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది డిసెంబర్ 24 నుండి 30 వరకు వినియోగదారుల వారోత్సవాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. వినియోగదారుల ఫోరమ్‌కు సంబంధించి కొన్ని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావడం సంతోషించదగ్గ విషయం అన్నారు. వినియోగదారులు ఎంతో కష్టపడి కొన్న వస్తువు నాణ్యత లోపిస్తే వారు ఎంత మనస్తాపానికి గురవుతారో గ్రహించి ఆ ధోరణిలో మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కోర్టులకు హాజరవడం కోసం దూర ప్రయాణాలు చేయాల్సిన అవసరం ఉండదని, తద్వారా ప్రయాణ సమయం, ఖర్చు తగ్గుతాయన్నారు. ఆహార కల్తీ నిరోధక శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి శంషీర్‌ఖాన్ మాట్లాడుతూ మనం కొనే వస్తువు స్థితిని గమనించడం మన బాధ్యత అన్నారు. వస్తువు తయారీ తేదీ, గడువు ముగింపు తేదీ, వస్తువు నాణ్యత ప్రమాణాలు, రుచి, వాసన తదితర వస్తువు యొక్క స్థితిని గమనించాలని తెలిపారు. ఏమైనా తేడాలు గమనించినట్లయితే వెంటనే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చున్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అర్జున్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం వర్తక వ్యాపారాల్లో వినియోగ దారుడు చాలా విధాలుగా నష్టపోతున్నామని చెప్పవచ్చున్నారు. అనంతరం జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ కమ్ అడ్వైజర్ పి.రమేష్ మాట్లాడుతూ వినియో గదారులు సాధారణ వస్తువులతో పాటు, ఆహార వస్తువుల విషయంలో కూడా తగు జాగ్రత్తలు నిర్వహించాలని సూచించారు. కార్యక్ర మంలో ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకులు, ఎపి వినియోగదారుల ఫోరం జిల్లా సభ్యులు, బార్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు హాజరయ్యారు.

నూతన వంగడాలను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

నూతన వంగడాలను అభివృద్ధి చేయాలని ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని సందర్శించారు. సందర్శనలో భాగంగా సస్యప్రయోజనం, సేద్య విభాగం, మృత్తిక శాస్త్రం, కీటక విభాగం, తెగుళ్ల శాస్త్రం విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిశోధన స్థానం ప్రగతికి తగిన సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు యూటిఆర్ -181 వరి వంగడాన్ని అందజేయాలని తెలిపారు. నువ్వులలో కొత్త వంగడాల రూపకల్పనలో పురోగతిని పర్యవేక్షించారు. ఆముదపు పంటను కడప జిల్లాలో ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయటానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వరిలో ఉల్లికోడును తట్టుకొనే కొత్త వంగడాల రూపకల్పనకై పరిశోధనలు చేయాలని సూచించారు. మినుములో సీతాఫలం ఆకు తెగులును తట్టుకొనే రకాలను గుర్తించడానికి పరిశోధనలు చేయాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇక్కడున్న సౌకర్యాలు ,అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులను వారి సలహాలను పాటించి ఉత్తమ శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఆమె వెంట తిరుపతి రార్స్ సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ సుమతి, పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ప్రభాకర రెడ్డి, కెవికె ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, డాట్‌సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్య, శాస్త్రవేత్తలు సునీల్ కుమార్, శ్రీవల్లి, మాధురి, భాగవత ప్రియ పాల్గొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - కడప: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి జెసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదు దారులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు, జడ్‌పి సిఇఓ ఓబులమ్మ, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా వ్యవసాయశాఖాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫాదర్‌ను సన్మానించిన లక్ష్మిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

గాలిబాలిని సన్మానిస్తున్న లక్ష్మిరెడ్డి

క్రిస్మస్ పర్వదినాలను పురస్కరించుకుని కడప క్యాథోలిక్ డయాసిస్ బిషప్ డాక్టర్ గాలిబాలి, మరియాపురం చర్చి ఫాదర్ ఈరి మరియన్నను టిడిపి సీనియర్ నాయకులు ఆలం ఖాన్‌పల్లె లక్ష్మి రెడ్డి సన్మానించారు. సోమ వారం మరియాపురం చర్చిలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చరిత్రలో కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు అన్ని పండుగలు కలిసి చేసుకుంటారని పేర్కొన్నారు ప్రపంచంలోని అన్ని దేశాలలో ఈ క్రిస్మస్ వేడుకలను చేసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశు , ఓబుల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, జోజప్ప, భద్రయ్య పాల్గొన్నారు.

న్యూ పీస్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి కడప అర్బన్ : నగరంలోని కాగితాల పెంటలో ఉన్న న్యూ పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్లో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌లో రకరకాల వంటలను విద్యార్థులు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ విచ్చేసి పలు రకాల వంటలను పరిశీలించి, రుచి చూశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పిల్లలు చాలా చక్కగా, రుచికరంగా వంటలు చేసుకొని రావడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల పిల్లలలో వంటల పట్ల అవగాహన వస్తుందని పేర్కొన్నారు. భావితరాలు బయట ఫుడ్‌కు అలవాటు పడకుండా ఇంటి ఫుడ్ తినడం ఆరోగ్యానికి చాలా మంచిదని తెలిపారు. కోటి విద్యలు కూటి కొరకే అన్నారు. ఆరోగ్యకరమైన ఫుడ్ తినడం భావితరాలకు మంచిదని చెప్పారు.

విద్యార్థులు తయారు చేసిన వంటకాలను అడిగి తెలుసుకుంటున్న డైరెక్టర్

ప్రజా సమస్యలు వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అధైర్య పడకండి అండగా ఉంటా : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అధైర్య పడకండి.. అండగా ఉంటానని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన నివాసం వద్ద ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటానని, ఎవరు అధైర్య పడకుండా ఉండాలని భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో ఎంపీ ఫోన్‌లో మాట్లాడారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని అన్ని చర్చిలు విద్యుత్ దీపకాంతులతో విరాజిల్లుతున్నాయి. మండల కేంద్రంలోని సిఎస్ఐ, ఎస్‌సిజి (సిఎస్ఐ), ఆర్‌సిఎం చర్చిల్లో రెవరెండ్ పాస్టర్ జెడి వినయ్‌కుమార్, రెవరెండ్ పాస్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ చర్చిలో పాస్టర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో యువకులు, మహిళలకు బైబిలు క్విజ్ నిర్వహించారు. చిన్నారులు, మహిళలు నాటికలు ప్రదర్శించారు. ఆట పాటలు, ఏసు క్రీస్తు వేష ధారణలు, ప్రత్యేక వస్త్రాలతో అలరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అబ్రహాం, ఏసుదాసు, రమేష్, జయన్న, చంద్ర, యువకులు, సంఘ సభ్యులు, సిస్టర్లు పాల్గొన్నారు.

రేపు శిల్పారామంలో నృత్య పోటీలు

ప్రజాశక్తి పులివెందుల టౌన్

క్రిస్మస్ సందర్భంగా బుధవారం సాయంత్రం శిల్పారామం, వైఎస్ఆర్ ఉల్లిమెల్ల లేక్ ఫ్రంట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిల్పారామంలో కరస్పాండెంట్ గీత విజయవాడ ఎక్సలెంట్ ఇనిస్టిట్యూట్ వారి నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్, పులివెందుల వారి చిన్నరులచే శ్రీ చిట్టి డ్యాన్స్ మాష్టర్ అధ్వర్యంలో అలాగే డాక్టర్ వైఎస్ఆర్ ఉల్లిమెల్ల లేక్ ఫ్రంట్‌లో రామంజి జ్యువెలర్స్, పిఎస్‌వి జ్యువెలర్స్, డికె సావర్కర్ ట్రావెల్స్ వారి సౌజన్యంతో శ్రీ సూర్య, సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి వారి శిష్య బృందంచే జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదరు కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆముదం పంట కోత ప్రయోగం చేస్తున్న ఎఓ

గణనీయంగా తగ్గిన ఆముదం దిగుబడులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో ఆముదం పంట దిగుబడులు గణనీయంగా తగ్గినట్లు ఎఓ శివమోహన్‌రెడ్డి, ఎఎస్ఓ మహేంద్ర తెలి పారు. మండలంలోని లోమడ, కోరగుంటపల్లె గ్రామాల్లో సోమవారం ఆముదం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు, మార్పుల కారణంగా దిగుబడులు గణనీ యంగా తగ్గిపోయాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కె అసిస్టెంట్ భువనేశ్వర్ పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులతో ఎంఇఓలు

ప్రత్యేక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విభిన్నప్రతిభావంతుల కోసం భవిత కేంద్రంలో ఇస్తున్న ప్రత్యేక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓలు ఓబులేస్, శారద కోరారు. సింహాద్రిపురం భవిత కేంద్రంలో ప్రపంచ విభిన్నప్రతిభావంతుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుల పట్ల చిన్నచూపు తగదన్నారు. కార్యక్రమంలో పిజియోథెరపి డాక్టర్ సుధీర్, ఐఆర్‌పి షాహిద్ బాషా, ఇమ్షాద్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఓ ముకుందారెడ్డి

ముద్దనూరులో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు సోమవారం ఎంపిడిఓ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో సాంకేతిక లోపంతో పని చేయలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల ప్రజలు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ కోరారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విజయ్‌భాస్కర్, మహిళా పోలీస్ ఆకాంక్ష, వెల్ఫేర్ అసిస్టెంట్ తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన అరటి రైతులకు పరిహారం పంపిణీ

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

నియోజకవర్గంలోని వై.కోట గ్రామ సమీపంలో ఏనుగుల దాడిలో అరటి పంట నష్టపోయిన రైతులకు కోడూరు రేంజ్ ఎఫ్ఆర్ఓ పిఎ శ్యాంసుందర్ సోమవారం పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం వేసవికాలంలో వై.కోట అటవీ సమీ పంలోని రైతు పొలాలపై ఏనుగుల మంద దాడి చేసి అరటి పంటను ధ్వంసం చేశాయని అన్నారు. అందులో నొక్కన సుబ్బరత్నమ్మకు రూ.42వేలు, కొండేటి చలపతికి రూ.10వేలు వంతున చెక్కులను రైతులకు అందించినట్లు తెలిపారు.

శనగ రైతుల ఆశలు ఆవిరి

రాలుతున్న పూత - దిగుబడి సగానికి తగ్గుతుందని ఆవేదన

అయ్యవారిపల్లిలో సాగులో ఉన్న శనగ పంట

ప్రజాశక్తి - వేంపల్లె

వరుస తుఫానులతో మేఘావృతం, చిన్నపాటి వర్షాలు పడుతుండడంతో శనగ రైతులు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. తమ ఆశలు ఆవిర వుతున్నాయని రైతుల్లో ఆందోళన నెలకొంది. మేఘాలు, వర్షాలతో శనగ పంట పూత రాలిపోతోంది. పులివెందుల నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రబీలో దాదాపు 20 వేల ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారు. వేంపల్లె మండలంలోని పాములూరు, అమ్మగారిపల్లె, కత్తులూరు, నందిపల్లి, అయ్యవారిపల్లె, నాగూరు, రామిరెడ్డిపల్లి, అలవలపాడు గ్రామాలతోపాటు ఆయా గ్రామాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారు. పంట పూత దశలో ఉంది. ప్రతికూల వాతావరణంతో వర్షాలు కురుస్తున్నాయి. వరుస వర్షాలతో భూమిలో తేమ శాతం పెరగడం, ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడం వల్ల శనగ పంటను వేరుకుళ్లు, ఆకుముడత తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో శనగ పంట దెబ్బతింటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి పంట దిగుబడి బాగా వస్తుందని ఆశతో ఉన్నామని, నిరాశ మిగులుతోందని రైతులు వాపోతున్నారు. పొగమంచుతో పంటకు పెద్దగా నష్టం లేకపో యినప్పటికీ, వర్షాలతో ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఒక్కసారి పూత రాలిపోయిన వాతావరణం అనుకూలిస్తే మరోసారి పూత వచ్చే అవకాశం ఉన్నా దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి 50 శాతానికి పడిపోతుందని, కాయలో నాణ్యత తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా రైతులు శనగ పంట సాగుతో నష్టపోయారు. మళ్లీ ఈ ఏడాది నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు అంటు న్నారు. శనగను నమ్ముకొన్న రైతులకు ధర కూడా నట్టేట ముంచు తోంది. విత్తనం వేసిన నెలలోపే వర్షాలు కురవడంతో పంట దెబ్బ తిందని రైతులు చెబుతు న్నారు. సన్న, చిన్నకారు రైతులు వేలాది రూపా యలు అప్పులు తెచ్చి శనగ పంట సాగు చేశారు. కనీసం పెట్టుబడులు వస్తాయో లేదోనని రైతుల్లో గుబులు పట్టుకుంది.

ప్రభుత్వం శనగ రైతులను ఆదుకోవాలి

శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. అకాల వర్షానికి పంట పూత రాలిపోతోంది. పంట దిగుబడి తగ్గుతుంది. భూమిలో తేమ శాతం అధి కం కావడంతో పంట దెబ్బతింది. తెగుళ్లు కూడా సోకుతున్నాయి. పంటను కాపాడుకునేందుకు అధిక డబ్బులు పెట్టి మందులను పిచికారి చేస్తున్నాం. వాతావరణ పరిస్థితుల అనుకూలంగాలేక పంటను కోల్పోవాల్సి వస్తోంది.

- ఉత్తమారెడ్డి, రైతు

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, సంఘ సంస్కర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగమని తెలిపారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం, గణతంత్ర రాజ్యం అనబడే నాలుగు స్తంభాల మీద.. స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే దూలాలు మీద భారత రాజ్యాంగ సౌధం నిర్మించబడిందని తులసిరెడ్డి తెలిపారు. నరేంద్ర మోడీ పాలనలో ఈ సౌధం స్ధంభాలు, దూలాలు బీటలు బారాయని విమర్శించారు. ఇది దేశానికే ప్రమాదకరమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వేమారాజా, వేమయ్య, రమణ, బద్రి, వెంకటేష్, మాష్, వినయ్, రవి, మదార్ పాల్గొన్నారు.

ఆర్థిక మాంత్రికుడు పివి నరసింహారావు

భారత స్వాతంత్ర్య సమర యోధుడు, భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు ఆర్థిక మాంత్రికుడని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. పివి నరసింహారావు 20వ వర్ధంతిని పురస్కరించుకొని సోమ వారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ పివి నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, వేమారాజా చెన్నకేశవ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, మహబూబ్ బాషా, మదార్, నాగ రాజు, రవి, వినయ్, సుబ్బరాయుడు, బద్రి, రమణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై రుద్ర శివానందరెడ్డి (40)అనే రైతు మృతి చెందాడు. రుద్ర శివానందరెడ్డి తనకున్న 12 ఎకరాల్లో అరటి, నిమ్మ సాగు చేశాడు. అరటి పంటకు మందు కొట్టేందుకు నీరు అవసరం కాగా సోమవారం తెల్లవారుజామున రంగారెడ్డి అనే వ్యక్తితో కలిసి రుద్ర శివానందరెడ్డి అరటి తోట వద్దకు వెళ్లి.. వ్యవసాయ బోరు మోటర్ ఆన్ చేస్తుండగా తెగిన వైర్లు చేతికి తగలడంతో విద్యుత్ షాక్ కొట్టింది. కింద పడిపోయిన శివానందరెడ్డిని కాపాడబోయిన రంగారెడ్డికి కూడా విద్యుత్ షాక్ కొట్టడంతో పెద్దగా కేకలు వేశాడు. పక్క పొలంలో ఉన్న వెంకట్రామిరెడ్డి అనే రైతు కేకలు విని సంఘ టన ప్రాంతానికి చేరుకున్నాడు. విషయాన్ని విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. విద్యుత్ సరఫరా నిలిపేశారు. అప్పటికే రైతు రుద్ర శివానందరెడ్డి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడిని భార్య రమాదేవి, తిరుపతిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి అనే ముగ్గురు కుమా రులున్నారు. రైతు మృతి చెందడంతో టి.వెలమవారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. రైతు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిల్లలతో విలపిస్తున్న మృతుడి భార్య రమాదేవి (ఇన్‌సెట్) రుద్ర శివానందరెడ్డి

మృతదేహాన్ని సందర్శించిన టిడిపి నేతలు

విద్యుత్ షాక్‌తో చనిపోయిన రైతు రుద్ర శివానందరెడ్డి మృతదేహాన్ని టిడిపి నేతలు రఘునాథ్ రెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి ఆస్పత్రిలో సందర్శించారు. సంఘటనపై రైతు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రైతు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని వారు తెలిపారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

క్రీడల్లో ఎస్ఆర్ఐటి విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈ నెల 19 నుంచి మూడు రోజులపాటు కడప గవర్నమెంట్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, రాయలసీమ వ్యాయమ కళాశాల ప్రొద్దుటూరులో నిర్వహించిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల డిప్లొమా విద్యా ర్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో కళాశాల విద్యార్థులు బాలుర విభాగంలో 200 మీటర్స్ రన్నింగ్‌లో జె.విష్ణువర్ధన్ గోల్డ్ మెడల్, 100 మీటర్స్ రన్నింగ్‌లో జె.విష్ణువర్ధన్, డి.నిరంజన్‌కుమార్, ఎం.ఉమర్ హుస్సేన్, పి.వెంకటకిరణ్, 400 మీటర్స్ రన్నింగ్ విష్ణువర్ధన్, నిరంజన్‌కుమార్, వీరబ్రహ్మం, పి.వెంకట కిరణ్ కాంస్య పతకాలు, టేబుల్ టెన్నిస్ (డబుల్స్) రామ నరసింహులు, వెంకట రాముడు రన్నర్ అప్‌గా, బాలికల విభాగంలో ఎన్.శశికళ ట్రిపుల్ జంప్‌లో గోల్డ్ మెడల్, 400 మీటర్స్ రన్నింగ్‌లో సిల్వర్ మెడల్, షార్ట్‌పుట్‌లో టి.గంగా ధరణి సిల్వర్ మెడల్ సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాడెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరెడ్డి, హెచ్‌ఒడిలు అభినందించారు.

గణితశాస్త్రంలో విద్యార్థులు రాణించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

గణిత శాస్త్రంలో విద్యార్థులు రాణించాలని శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్ శ్రీచైతన్యరెడ్డి తెలిపారు. సోమవారం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా శ్రీ చైతన్య పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గణితంలో ప్రతి విద్యార్థి రాణించాలని కోరారు. గణిత మేధావి రామానుజన్‌ను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని కోరారు. గణితం ద్వారా ప్రపంచాన్ని శాసించవచ్చు అన్నారు. భవిష్యత్తుపై గణితంలో అసక్తి పెంచుకోవాలని సూచించారు. గణితం ద్వారా విద్యార్థులు మరిన్ని విషయాలు తెలుసుకొనేందుకు గణిత ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల డైరెక్టర్ చేతన్ రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న పాఠశాల డైరెక్టర్ శ్రీచైతన్య రెడ్డి

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని సీతారాంపేటకు చెందిన భీమిశెట్టి బలరామయ్యకు సిఎం సహాయనిధి కింద రూ.4,16,250ల చెక్కును సోమవారం ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిందని అన్నారు. అనారోగ్యానికి గురైన వారికి సిఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందించడానికి ప్రత్యేకంగా వ్యవస్థను ఏర్పరిచి పెద్ద ఎతు_న లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించే దిశగా కూటమి ప్రభు త్వం పనిచేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మానవీయ విలువలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - రామాపురం

విద్యార్థులు మానవీయ విలువలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ రచయిత్రి విరసం సభ్యురాలు శశికళ పేర్కొన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలలో ఎలాంటి భయానికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు జీవితంలో పుస్తక పఠనంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలు, వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

'పోరెడ్డి' చొరవతో పేద విద్యార్థులకు దక్కిన వరం

-రేపు 18 మంది విద్యార్థులకు ఉచితంగా ఢిల్లీకి విమానయానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

మండలంలోని హిమకుంట్ల, సింహాద్రిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యా ర్థులకు మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొర వతో నాలుగు రోజులపాటు ఢిల్లీ, దాని చుట్టు పక్క ప్రాంతాల సందర్శనకు ఉచితంగా విమాన యానం లభించింది. ఆయా పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యా ర్థులకు ఈ అవకాశాన్ని కల్పించారు. సాధారణంగా విమానం గాలిలో ఎగురుతుంటే పిల్లలైన, పెద్దలైన ఆకాశం వైపు చూడాల్సిందే. పిల్లల్లో మరీ ఎక్కువ అందులో ఎగరాలని. ఆ అవకాశం హిమ కుంట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు విమాన ప్రయాణం దక్కింది. హిమకుంట్ల గ్రామానికి చెందిన మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆ అవకాశం కల్పించారు. తన గ్రామంలోని పేద ప్రతిభావంతులైన విద్యార్థులను విమానం ఎక్కించాలని ఆయన ఆలోచించారు. విద్యార్థి దశలోనే విమాన ప్రయాణం అనేది వారిలో ఎంతో ప్రేరణ కలిగిస్తుందని భావించారు. అనుకున్నదే తడవుగా 2016లో అమరావతి, 2017లో చెన్నై, 2018లో హైదరాబాద్, 2019లో ఢిల్లీ పరిసర ప్రాంతాల విజ్ఞాన, విహారయాత్రలు దిగ్విజయంగా నిర్వహించారు. తర్వాత కరోనా ప్రభావం, ఇతర కారణాలతో విమానయానానికి విరామం వచ్చింది. మళ్లీ ఈ సంవత్సరం డిసెంబర్ 25న ఢిల్లీ యాత్రకు సిద్ధమయ్యారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు జి.రవిచంద్రారెడ్డి సారధ్యంలో నాలుగు రోజులపాటు ఈ యాత్రలో ఢిల్లీ పార్లమెంట్, లోటస్ పాండ్, సిసోడియా స్కూల్, ఇండి యా గేట్, అక్షరధామ్, కుతుబ్మినార్, ఫతేపూర్ సిక్రీ, ఆగ్రా తదితర ప్రాం తాలను విద్యా ర్థులు సందర్శించ నున్నారు. హిమకుంట్ల పాఠశాల విద్యార్థులు 15 మందికే కాకుండా సింహాద్రిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురికి కూడా ఈ సువర్ణావకాశం దక్కింది. విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా, ఉపాధ్యా యులకు రాయితీతో ఈ విమాన ప్రయాణం అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఎంఇఓ-1ఓబులేస్ మాట్లాడుతూ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అభినం దించారు.

మున్సిపల్ శాఖ మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

పులివెందుల అభివృద్ధికి సహకరించండి

- మున్సిపల్ శాఖ మంత్రికి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వినతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల మున్సిపాలిటీ గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోలేదని, ఇందు కోసం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ శాఖ మంత్రిని కలిసి రాంగోపాల్‌రెడ్డి పులివెందుల సమస్యలను వివరించారు. మున్సిపాలిటీలో అనేక ప్రాంతాల్లో సరియైన డ్రయినేజీ, సిమెంటు రోడ్లు, తాగునీటి సరఫరా సరిగాలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 2019-2024 మధ్య కాలంలో ఆ నియోజకవర్గానికి చెందిన శాసనసభ్యుడే ముఖ్యమంత్రిగా ఉన్నా సరియైన అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నిధులు మంజూరు చేసినా పనులు చేయడంలో యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. పులి వెందుల మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి అత్యవసరంగా రూ.5కోట్లు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కోరారు.

పనులు చేయిస్తున్న టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది

అన్నవరం ఎస్‌సి కాలనీలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అన్నవరం ఎస్‌సి కాలనీలో క్రిస్మస్ సందర్భంగా సోమవారం టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను చేపట్టారు. జెసిబి యంత్ర సాయంతో వ్యర్థ పదార్థాలను తొలగించారు. మురికి కుంటల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అపరిశుభ్రత ఉన్న ప్రాంతాలను గుర్తించి పనులను చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక టిడిపి నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

26 నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - చాపాడు

ఈనెల 26నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వీరకిషోర్ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లో వివిధ రకాల సమస్యలు ఉన్నవారు మండల పరిధిలో ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. 26న ఎన్.ఓబాయపల్లి, 27న సోమాపురం, 28న పెద్ద గురువలూరు గ్రామాల్లో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేరు మార్పు, పుట్టిన తేదీ, అడ్రస్ మార్పుల వంటి సమస్యలు ఉన్నవారు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళలపై జరుగుతున్న హింస అనాగరికం

ప్రజాశక్తి - వీరబల్లి

మహిళలపై జరుగుతున్న హింస అనాగరికమని ఎంపిపి రాజేంద్ర నాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు, బాలికల పట్ల జరుగుచున్న అఘాయిత్యాలు తగ్గినప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. జండర్ వివక్షత చట్ట వ్యతిరేకమనే భావన అందరిలో కలగాలన్నారు. తహశీల్దార్ శ్రావణి మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడంలో మహిళా సంఘాలు ప్రముఖ పాత్ర వహించాలన్నారు. స్థానిక వెలుగు ఎపియం ఖాదర్ వలి,ఇఒపిఆర్‌డి రామ చంద్రారెడ్డి, మట్లి గ్రామ సర్పంచ్ నాగార్జునచారి, వెలుగు సిసిలు, కృష్ణయ్య, నాగేంద్ర, సుధాకర్, మండల సమాఖ్య కార్యదర్శి గులాబ్ జాన్, ఉపాధ్యాయురాలు వారాధమ్మ, విఓఎలు తులసి, కవిత, మహేశ్వర్‌రెడ్డి, మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ విలేకరి తల్లం ప్రసాద్ మృతి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు సీనియర్ పాత్రికేయుడు తల్లం వెంకట నాగ ప్రసాద్ (53) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మైదుకూరు ఆంధ్రజ్యోతి విలేకరిగా ప్రసాద్ సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నారు. గతంలో ఆయన పలు పత్రికల్లో పనిచేశారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. సోమవారం తిరుపతి సిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొం దుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. సౌమ్యుడిగా ప్రజలు, నాయకులు, అధికారుల అభిమానాన్ని పొందారు. ప్రసాద్ అకాల మృతిపట్ల పలువురు దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ప్రసాద్ కుటుం బ సభ్యులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.